క్లుప్తంగా

తెరుచుకున్న మినరల్ వాటర్ ప్లాంట్

సాక్షి స్పందన

ఐనవోలు : మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినరల్ వాటర్‌ప్లాంట్ ఎట్టకేలకు తెరుచుకుంది. గ్రామస్తులు, జీఎంపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి నల్లబెట్ల చిన్నరాజు వాటర్‌ప్లాంట్ మరమ్మతుకు చేరుకుని మూతపడిందని సాక్షి దినపత్రిక దృష్టికి తీసుకురాగా 'మినరల్ వాటర్‌ప్లాంట్ తెరిపించండి' అనే శీర్షికన సోమవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన జీపీ అధికారులు వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేపించి గురువారం రాత్రి నుంచి గ్రామస్తులకు మినరల్‌వాటర్‌ను సరఫరా చేశారు. నల్లబెట్ల చిన్నరాజు, జీపీ కార్యదర్శి కిశోర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సాక్షి కథనానికి మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

దండేపల్లికి బస్సు సర్వీస్ ప్రారంభం

ఎల్కతుర్తి : మండలంలోని దండేపల్లి గ్రామానికి హనుమకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను ఆర్‌ఎం విజయ్‌భాను శుక్రవారం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు వరంగల్ నుంచి వయా బావుపేట, దండేపల్లి, వల్బాపూర్ మీదుగా హుజూరాబాద్‌కు వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం బస్సు సర్వీస్ నడుపుతున్నట్లు వెల్లడించారు. గ్రామ ప్రజలు బస్సు స్వస్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ జగత్ సింగ్, విద్యుత్ ఏఈ లక్ష్మణ్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, గొలిపెల్లి సంపత్ పాల్గొన్నారు.

డెటాల్ తాగి వృద్ధుడి ఆత్మహత్య

ధర్మసాగర్ : డెటాల్ తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని ఎల్కుర్తి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కుర్తి గ్రామానికి చెందిన మాతంగి వెంకటయ్య (65) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్థాపం చెందిన వెంకటయ్య.. గురువారం తెల్లవారుజామున ఇంట్లో డెటాల్ తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు మాతంగి నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పాముకాటుకు గురైన రైతు

ధర్మసాగర్ : మండలంలోని ఎల్కుర్తి గ్రామ శివారు రామన్నగూడెంకు చెందిన ఓ రైతును పాము కాటు వేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడెంకు చెందిన కొలిపాక సురేష్ రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని తమ వ్యవసాయ పంట పొలంలో పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో పాము అతడిని కాటు వేసింది. దీంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సామాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్ పైలెట్ ప్రవీణ్ సహాయంతో ఈఎంటీ సుధ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఆర్‌యూపీపీ కార్యవర్గం ఎన్నిక

కమలాపూర్ : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) మండల శాఖ నూతన అధ్యక్షుడిగా కె.సారయ్య ఎన్నికై నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫారుఖ్‌సాదత్‌అలీ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్.రామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సామ్రాజ్, ఉపాధ్యక్షులుగా ఆశలత, ప్రసూనాంబ, మహిళా కార్యదర్శిగా మాధవి, కార్యదర్శిగా విజయ్, జిల్లా ప్రతినిధిగా భూమలింగం ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగుల భిక్షపతి, జిల్లా కోశాధికారి బత్తిని వేణుగోపాల్, రాష్ట్ర, జిల్లా బాధ్యులు గంగాధర్, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

ఆత్మకూరు : బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పెద్దాపురం, గుడెప్పాడు గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలను శుక్రవారం ఆయన పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గుడెప్పాడ్ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కుమారస్వామి ఉన్నారు.

హాజరైన ఎమ్మెల్యే

పరకాల : పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో జిల్లా రాష్ట్రీయ పోషణమాసం నిర్వహించగా ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆటపాటలతో ఒత్తిడిలేని ప్రాథమిక విద్యను అందించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒంటికి, రెంటికి ఇబ్బందులు

- నిరుపయోగంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లకు వెళ్లకుండా ముళ్లకంప వేసిన సిబ్బంది

కమలాపూర్ : మండల కేంద్రం నుంచి నిత్యం వందలాది మంది వరంగల్, హనుమకొండ, హుజూరాబాద్, పరకాల, జమ్మికుంట తదితర పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీకి కూడా ఇక్కడి నుంచి ఆదాయం భారీగానే సమకూరుతుంది. అయినా ప్రయాణికుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే నిధుల కొరత కారణంగా ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం మధ్యలోనే నిలిపోయిన విషయం తెలిసిందే. కనీసం బస్టాండ్ ప్రాంతంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు వినియోగంలోకి రాకపోవడంతో ప్రయాణికులు ఒకటి, రెండుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిరుపయోగంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు..

బస్టాండ్ ప్రాంతంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిరుపయోగంగా మారడంతో ప్రయాణికులు మల, మూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎనిమిదేళ్ల క్రితం సుమారు రూ.18 లక్షల అంచనా వ్యయంతో స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. కానీ ప్రస్తుతం మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ వాటి నిర్వాహణలోపంతో కంపుకొడుతున్నాయని ప్రయాణికులు ఆగ్రహిస్తున్నారు. దీంతో వాష్‌రూంలకు వెళ్లకుండా అడ్డుగా ముళ్లకంప వేయడంతో అవి కాస్తా నిరుపయోగంగా మారాయి. విధిలేని పరిస్థితుల్లో ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, స్థానికులు పలువురు బస్టాండ్ ఆవరణలో బహిరంగ మూత్రవిసర్జన చేస్తున్నారు.

మూత్రశాలలను వినియోగంలోకి తేవాలి



ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ ప్రాంతంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించారని సంతోషించాం. కానీ నిర్మాణం పూర్తయినప్పటికీ వాటిని వినియోగంలోకి తేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

- దద్దు కుమార్‌యాదవ్, ప్రయాణికుడు

ఇబ్బందులు పడుతున్నాం



బస్టాండ్ ప్రాంతంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు వినియోగంలో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. విధిలేని పరిస్థితుల్లో పలువురు పురుషులు బస్టాండ్ ఆవరణలో మూత్ర విసర్జన చేస్తున్నారు. కానీ మహిళల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. అధికారులు వెంటనే స్పందించాలి.

- దుండ్ర బాబు, ఆటోడ్రైవర్

చర్యలు చేపడుతాం



బస్టాండ్ ప్రాంతంలో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లకు మెయింటెనెన్స్ చేసే వారు లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఎవరైనా వాటి నిర్వహణకు ముందుకొస్తే వారికి నిర్వహణ బాధ్యతలు అప్పగించి తిరిగి వాటిని వినియోగంలోకి తీసుకొస్తాం.

- గుండె బాబు, ఎంపీడీఓ, జీపీ ప్రత్యేకాధికారి

సీఎస్ఐ మిషన్ సెంటర్‌లో ఉచిత వైద్యశిబిరం

శాయంపేట : మండలంలోని కాట్రపల్లి సీఎస్ఐ మిషన్ సెంటర్‌లో 78 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ ప్రతీష్‌బాబు, రెవరెండ్ రిజు మ్యాథ్యూ పాల్గొని సీఎస్ఐ జెండా ఆవిష్కరించారు. అనంతరం రెవరెండ్ సామ్ జార్జ్ ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ విద్యశ్రీ, పలు గ్రామాల నుంచి వచ్చిన రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లిబియాసామ్, సేవకులు ప్రకాశం, శామ్యూల్, రుబెన్, బెన్నాజీ, అనిల్‌కుమార్, బాబు, ఉపాధ్యాయులు రాజన్న, రాజునాయక్, బీజయ్, శైలజ, మౌనీయ, ఉమ, శృతి, పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు

దామెర : అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై అశోక్ హెచ్చరించారు. ఒగ్లాపూర్ జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా గుడెప్పాడ్ నుంచి హనుమకొండకు అనుమతులు లేకుండా మొరం లోడ్‌తో వెళుతున్న టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు, రవాణా చట్టరీత్యా నేరం అన్నారు.

గణిత బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

శాయంపేట : విద్యార్థులకు గణితం సులువుగా అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు గణిత బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఏఎంఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమికోన్నత స్థాయి (యూపీ) లెవెల్ మ్యాథ్స్ టీచర్స్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి పరకాల, నడికూడ, శాయంపేట మండలాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఎల్ఐపీ, ఎఫ్ఎల్ఎన్, ఎస్ఏఎస్‌పై ఉపాధ్యాయులకు సలహాలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు సులువుగా గణితం నేర్చుకునేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. సామర్థ్యాలు పెంపొందించే విధంగా ప్రతి పీరియడ్‌లో 10 నిమిషాలు చదవడం కోసం కేటాయించాలన్నారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి చదువుపై ఎక్కువ శ్రద్ధ వహించేలా చూడాలన్నారు. ఎంఈఓ భిక్షపతి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సారయ్య, ఆర్పీలు రఘు, చంద్రయ్య, విద్యాసాగర్, సీఆర్పీ వంశీ, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

బొడ్డెమ్మ .. బొడ్డెమ్మా కోల్.. బిడ్డాలెందరో

దామెర : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా బొడ్డెమ్మ వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకొంటున్నారు. చిన్నారులు శుక్రవారం ఐదోరోజు ఆటపాటలతో సందడి చేశారు. మండల కేంద్రంలోని ఆరెవాడలో పుట్టమన్నుతో బొడ్డెమ్మను తయారుచేసి పసుపు, కుంకుమ, పూలతో అలంకరించారు. పసుపుతో గౌరమ్మను తయారుచేసి నూతన వస్త్రాల్లో ఉంచి బొడ్డెమ్మను తలుచుకుంటూ పాటలు పాడారు. పితృ అమావాస్య వరకు ఈ వేడుకలు కొనసాగనున్నాయి. అదేవిధంగా మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డిస్నీల్యాండ్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నారు. ముఖ్య సలహదారుడు మల్లయ్య, సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు రాకేష్‌భాను, దీనేష్‌చందర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

సంక్షిప్తంగా

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

శాయంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎంపీపీ తిరుపతి రెడ్డి అన్నారు. కొప్పుల, జోగంపల్లి, పెద్దకోడెపాక, గోవిందాపూర్ గ్రామాలను శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సందర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 24 గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలు కష్టపడాలని కోరారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

శాయంపేట : సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ, అదుపు చేయవచ్చని సీఐ రంజిత్‌రావు అన్నారు. రాబోయే దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కొప్పుల గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలతో నేరాతను నియంత్రణ, అదుపు చేయవచ్చని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరుగుతన్నాయని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. యువకులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. రాబోయే దసరా ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రతలు తీసుకుంటున్నామన్నారు.

మందకృష్ణపై వ్యాఖ్యలు సరికాదు

శాయంపేట : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగపై వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా ఇన్‌చార్జ్ ముక్కెర ముఖేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు.

బ్లాక్ మార్కెట్ అరికట్టాలి

ధర్మసాగర్ : బ్లాక్ మార్కెట్ అరికట్టి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మండల కేంద్రంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. భిక్షపతి, వెంకటేశ్, శంకర్ నాయక్, రాజయ్య, లింగయ్య, కొమురయ్య, సారయ్య, రాజు, బాష, డీజే రాజు, సునీల్, రమేశ్, స్వరూప, సునీత, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

ఐనవోలు : పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడంతో పాటు అవినీతికి దూరంగా ఉండాలని మామునూరు ఏసీపీ తిరుపతి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. పోలీసుల నడవడిక, ఇతర అంశాలపై సూచనలు చేశారు. ఇన్స్‌పెక్టర్లు గౌరవ ప్రదంగా మెదలి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఏసీపీతో పాటు పర్వతగిరి ఇన్స్‌పెక్టర్ రాజగోపాల్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉపాధిహామీతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు

దామెర : ఉపాధిహామీ పథకం ద్వారా లబ్ధిపొంది ఆర్థికంగా వృద్ధి సాధించాలని అడిషనల్ డీర్డీఓ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సీతారాంపూర్‌లో ఉపాధిహామీ పథకం ద్వారా సాయం పొంది సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటను ఆయన శుక్రవారం పరిశీలించారు. పంట దిగుబడి, మార్కెటింగ్ చేసే విధానాన్ని రైతు రాజమహ్మద్, రంజాన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఉత్తమ పనిగా గుర్తించి నివేదిక తయారు చేసి కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీకి సమర్పిస్తామని చెప్పారు. అనంతరం పసరగొండ డంపింగ్ యార్డును సందర్శించి ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఊరుగొండలో ఏర్పాటుచేసిన స్వచ్ఛతహీ సేవా ఎస్‌బీఎం సెల్ఫీపాయింట్‌ని ప్రారంభించారు. ఆయన వెంట ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డీటీసీ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ శారద, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



సీతారాంపూర్‌లో డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న అధికారులు

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

ఆత్మకూరు : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఆత్మకూరు హైస్కూల్ హెచ్‌ఎం నిర్మలాకుమారి అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్‌సీఐ మండలస్థాయి క్రీడలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. దుర్గా ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ గ్రేసమ్మ పాల్గొన్నారు.



ఆత్మకూరు : మాట్లాడుతున్న నిర్మలాకుమారి

దామెరలో..

దామెర : విద్యార్థులు చవుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండల కేంద్రంలో 68వ ఎస్‌జీఎఫ్ఐ మండలస్థాయి క్రీడలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై హాజరై మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడుతాయని అన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని క్రీడాకారులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. ఎంఈఓ రాజేష్‌కుమార్ అధ్యక్షత వహించగా, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, మాజీ కోఆప్షన్ సభ్యుడు పోల్సాని శ్రీనివాస్‌రెడ్డి, బాబురావు, పీఈటీలు దేవేందర్, లక్ష్మీనారాయణ, రాజేశ్వర్, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో తపాలా పాలసీలు

శాయంపేట : పేద కుటుంబాలకు రక్షణగా తపాలా పాలసీలు ఉన్నాయని, వాటిని మండల ప్రజలు వినియోగించుకోవాలని పరకాల ఉపవిభాగం సహాయక పర్యవేక్షకుడు అనంతరామ్‌నాయక్ అన్నారు. శుక్రవారం కొప్పుల గ్రామ తపాలా శాఖను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురికి బీమా పత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. తపాలా శాఖ పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే పాలసీలను ప్రవేశ పెట్టిందన్నారు. రూ. 550తో పది లక్షలు రూ.750తో 15 లక్షల జనరల్ ఇన్సూరెన్స్ స్కీములను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. గ్రామీణ తపాలా జీవిత బీమా, సుకన్య ఖాతా, సేవింగ్ ఖాతా, ఫిక్స్ డిపాజిట్ ఖాతాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సేవలను వినియోగించుకోవాలని కోరారు. మెయిల్ ఓవర్ సీర్స్ జగదీష్, సంతోష్, కొప్పుల బీపీఎం కృష్ణ, పాల్గొన్నారు.



బీమా పత్రాలను అందజేస్తున్న అనంతరామ్

లక్ష్మణ్‌బాపూజీ సేవలు చిరస్మరణీయం

పరకాల : మూడు తరాల స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన పాత్ర పోషించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం ఉద్యమించిన గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ, అని అతని సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కొనియాడారు. లక్ష్మణ్ బాపూజీ జయంతిని జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అధికారికంగా శుక్రవారం ఆర్టీసీ బస్ డిపో క్రాస్‌లో నిర్వహించారు. ఆయన కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, పద్మశాలి సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. లక్ష్మణ్‌బాపూజీ ఉద్యమకారుడిగా, ప్రజాస్వామికవాదిగా, పీడిత ప్రజల పక్షపాతిగా నిబద్ధత కలిగిన గొప్ప రాజకీయ నాయకుడని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, ఆర్డీఓ నారాయణ, మున్సిపల్ కమిషనర్ నర్సింహ, ఎంపీడీఓ ఆంజనేయులు, తహసీల్దార్ భాస్కర్, ఏసీపీ కిశోర్‌కుమార్, లక్ష్మణ్‌బాపూజీ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ రవీందర్, బాపూజీ విగ్రహ కమిటీ అధ్యక్షుడు రాజేశ్వరప్రసాద్, కాంగ్రెస్, బీజేపీ పట్టణ అధ్యక్షులు భిక్షపతి, శ్రీనివాస్, కౌన్సిలర్స్, పద్మశాలి సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి..

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు. అదే విధంగా బిట్స్ పాఠశాలలో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ యుగేందర్‌తో పాటు ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

వేలేరులో..

వేలేరు : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని పద్మశాలి సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలోని పద్మశాలి భవనంలో లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్, లక్ష్మీనారాయణ, మహేందర్, రాజు, శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. ఆయన జయంతిని శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన మహనీయుడు లక్ష్మణ్‌బాపూజీ అని కొనియాడారు. డీటీ ఖురేషి, ఆర్ఐలు భాస్కర్‌రెడ్డి, సంపత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ రంగాచారి, ఎంఈఓ రాజేష్‌కుమార్, ఏపీఓ శారద లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు రవి, రవి, మార్కండేయ, రాము, చంద్రమౌళి, రవీందర్, కృష్ణమూర్తి, రాజేందర్, వీరన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో శుక్రవారం పలువురు నాయకులు ఘనంగా నిర్వహించారు. లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



పరకాల : కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



దామెర : తహసీల్దార్ కార్యాలయంలో..



పరకాల : పూలమాల వేస్తున్న ధర్మారెడ్డి



వేలేరులో..

ఎంఈఓకు ఘన సన్మానం

ఐనవోలు : మండల విద్యా శాఖ అధికారి(ఎంఈఓ)గా ఆనందం బాధ్యతలు స్వీకరించగా శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. మండలంలో విద్యా వ్యవస్థలను మెరుగుపర్చేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను సైతం ప్రభుత్వానికి తెలుపాలని కోరారు. మండల బాధ్యుడు బ్రహ్మచారి, విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, కార్యదర్శులు రాజు, కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

